క్లుప్తంగా

45 మద్యం బాటిళ్లు స్వాధీనం

వేటపాలెం: రైల్వే స్టేషన్ దగ్గరలో బెల్టు షాపుపై ఆకస్మిక దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితురాలు స్టేషన్ దగ్గరలో రోడ్డు పక్కన టీ స్టాల్ నిర్వహిస్తూ అందులో 45 మద్యం బాటిళ్లు పెట్టి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెప్పారు. బెల్టు షాపులు నిర్వహించినా, ప్రైవేటుగా మద్యం విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు



హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఇందిర

మేదరమెట్ల: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల కేంద్రమైన కొరిశపాడులో మంగళవారం జిల్లా హెచ్ఐవీ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ ఇందిర మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రజలకు సోకకుండా నిర్మూలన నియంత్రణలకు అందరూ కృషి చేయాలన్నారు. రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్ప్ సంస్థ ఎంఈఏ భార్గవ్, ఏఎన్ఎం రాధ, శారద, నయోమి సువార్త, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటుగా పారిశుద్ధ్య నిర్మూలన కోసం ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి రోజువారీగా పారిశుద్ధ్య సమస్యలను లేకుండా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుని గ్రామాల్లో చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి



టూటౌన్ సీగా బాధ్యతలు తీసుకున్న నాగభూషణం

చీరాల: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను నియంత్రించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని నూతన సీఐ బి.నాగభూషణం తెలిపారు. చీరాల టూటౌన్ సీఐగా మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన సీఐల బదిలీల్లో ఇక్కడ పని చేస్తున్న జి.సోమశేఖర్‌ను కొండపికి బదిలీ అయ్యారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న నాగభూషణంను చీరాల టూటౌన్‌సీఐగా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను నియంత్రించడంతో పాటుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటుగా రాత్రి గస్తీలు ముమ్మరం చేస్తానని టూటౌన్ సీఐ తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగభూషణాన్ని పలువురు ఎస్సైలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

భవిత కేంద్రానికి బీరువా అందచేత



భవిత కేంద్రానికి బీరువాను బహూకరించిన దాతలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని భవిత కేంద్రానికి గ్రామానికి చెందిన దేవరపల్లి ఆనంద్, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని మంగళవారం బీరువాను అందజేశారు. అలాగే ఇద్దరు దివ్యాంగుల తల్లిదండ్రులను ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా భవితకేంద్రం రిసోర్స్ ఉపాధ్యాయుడు కొండయ్య మాట్లాడుతూ దాతలు అందజేసిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వాణీశ్రీ, అజయ్, సంధ్యారాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రత్యేక భద్రత చట్టం అవసరం..

కోల్‌కతాలో మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలి. దీని కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకచట్టం తీసుకురావాలి. ప్రతి మహిళా వైద్యసిబ్బందికి తాము పనిచేస్తున్న చోట తాము పూర్తి భద్రతలో ఉన్నామన్నా ధైర్యం కలిగించాలి. అప్పుడే వైద్యులు భయం లేకుండా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించగలుగుతారు.

– శ్రీహర్ష, వైద్యాధికారి, యద్దనపూడి పీహెచ్‌సీ





వైద్యులు, సిబ్బందికి భరోసా కల్పించాలి..

ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే మహిళా సిబ్బందికి వందశాతం భరోసా కల్పించాలి. డ్యూటీలో ఉన్న వైద్యులకు, స్టాఫ్‌నర్స్‌ల రక్షణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రత ఉండేలా చూడాలి. ప్రభుత్వం కూడా విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. అలాగే కోల్‌కతా ఘటన దోషులను తక్షణమే శిక్షించాలి.

– సీహెచ్ వెంకట నరసమ్మ, స్టాఫ్‌నర్స్, యద్దనపూడి పీహెచ్‌సీ

గణనాథుడి పూజకు వేళాయే..!



ఉత్సవాలకు సిద్ధమైన విగ్రహాలు



వినాయక విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కార్మికుడు

- సిద్ధమైన గణనాథులు
- అద్దంకి కేంద్రంగా విగ్రహాల తయారీ
- విగ్రహాలను బుక్ చేసుకుంటున్న ఉత్సవ నిర్వాహకులు
- రూ. 3 వేల నుంచి రూ.45 వేల వరకు పలుకుతున్న విగ్రహాలు

అద్దంకి రూరల్: వినాయక చవితి అంటే చాలు చినారులకు, యువతకు, పెద్దలకు ఎనలేని ఉత్సాహం. వివిధ రకాల్లో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. తొమ్మిది రోజులపాటు గణనాథుడిని రోజుకొకరోజు ప్రత్యేక పూజలు చేసి అందంగా అలంకరిస్తారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆనందంగా గడుపుతారు. భవిష్యత్‌లో చేపట్టే ప్రతి పనిలో విఘ్నాలు కలగకుండా ఉండేందుకు భక్తుల నుంచి తొలి పూజలు అందుకునే గణనాథుడి విగ్రహాలు అద్దంకిలో సిద్ధం అయ్యాయి. సెప్టెంబర్ 7వ తేదీన భాద్రపద శద్ధ చవితి రోజున ప్రారంభయ్యే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకోనున్న గణనాథులు వివిధ రకాల రూపాల్లో ఆకర్షించే రంగులతో ముస్తాబయ్యాయి. ఉత్సవ కమిటీలు కూడా ఖర్చుకు ఏమాత్రం వెనుకాడడం లేదు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో యువత ఈసారి భారీగా వినాయక విగ్రహాలను పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయకుడు

అద్దంకి కేంద్రంగా విగ్రహాల తయారీ..

వినాయకుడి విగ్రహాల తయారీ అద్దంకి కేంద్రంగా చేసుకుని బీహార్ నుంచి వచ్చిన పనివాళ్లు కుటుంబాలతో వచ్చి 8 నెలల నుంచి తయారు చేస్తున్నారు. 2 అడుగుల చిన్న విగ్రహాల నుంచి సుమారు 12 అడుగుల ఎత్తైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను తయారు చేసి అందుబాటులోకి తెచ్చారు.

అపార్ట్‌మెంట్లలో వినాయక సందడి..

గతంలో వినాయక ప్రతిమలను ప్రధాన కూడల్లో రెండు, మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేవారు. నేడు పట్టణంలోని ప్రతి వీధిలో ఎత్తైన విగ్రహాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. పట్టణంలోనే సుమారు 30 పందిళ్ల వరకు ఏర్పాటు చేసి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ఏర్పాటుకు చిన్న, పెద్ద, మహిళలు ఆసక్తి చూపటంతో చిన్న చిన్న వీధుల్లో, ప్రతి ఆపార్ట్‌మెంట్‌లో చేస్తుండటంతో విగ్రహాల కొనుగోలు పెరుగుతోంది. అద్దంకి పరిసర గ్రామాల్లో గ్రామానికి రెండు చొప్పున 50 విగ్రహాల వరకు ఏర్పాటు చేస్తారు. వినాయక చవితి పక్షం రోజులే ఉండటంతో ఉత్సవ నిర్వాహకులు ముందుగా విగ్రహాన్ని బుక్ చేసుకుని ఉత్సవాలను ప్రారంభిస్తున్నారు. సమయం దగ్గర పడుతున్న కొద్ది విగ్రహాలు అందుబాటులో ఉండవని, అధిక ధరలు పలికుతాయనే ఉద్దేశంతో ముందుగానే కొంత సొమ్ము చెల్లించి తనకు ఇష్టమైన విగ్రహాన్ని



విగ్రహానికి పెయింట్ వేస్తున్న తయారీదారుడు

సొంత చేసుకుంటున్నారు. సుమారు 750 విగ్రహాలు తయారు చేస్తే ఇప్పటికి 50 విగ్రహాల వరకు అద్దంకి పరిసర గ్రామాల భక్తులు వచ్చి అడ్వాన్స్‌లు చెల్లించి బుక్ చేసుకున్నట్లు తయారీదారులు చెప్తున్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు..

వివిధ రూపాలతో ఆకర్షించే రంగులతో 2 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు సుమారు రూ. 3 వేల నుంచి రూ.45 వేల వరకు ఉన్నాయని తయారీదారులు చెప్తున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసే పందిళ్లకు ఎత్తైన విగ్రహాలు నిర్వహకులు తీసుకెళ్తున్నారు. ఎక్కువ శాతం 4 అడుగుల ఎత్తు నుంచి 8 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలు అమ్ముడుపోతున్నాయి. అన్ని వర్గాల వారికి వారి బడ్జెట్‌కు సరిపోయే విధంగా విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి.

ఈఏడాది వ్యాపారం బాగుంటుందని ఆశిస్తున్నాం..

ఈ సంవత్సరం అద్దంకి పట్టణం, పరిసర గ్రామాలలోని ప్రజలు ఎక్కువ మంది ఉత్సవాలు నిర్వహించడానికి ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారం బాగుంటుందని ఆశిస్తున్నాం. 8 నెలల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి విగ్రహాలు తయారు చేశాం. లాభాలు పెద్దగా లేకపోయినా, నష్టం లేకుండా బయటపడుతున్నాం.

– మహేష్, తయారీదారుడు

సాగర్ నీరు వదలకుంటే ధర్నా చేస్తాం

మార్టూరు: నాగార్జున సాగర్ కాలువ రెండో జోన్ పరిధిలో అధికారులు నీటిని వదలకుంటే సెప్టెంబర్ 2వ తేదీన రైతులతో ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా రైతు సంఘం నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు హెచ్చరించారు. మార్టూరులో మంగళవారం సాయంత్రం మండల రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ డ్యాం పూర్తిగా నిండిందన్నారు. ఈక్రమంలో సముద్రంలో భారీగా నీటిని వదులుతూ జోన్-2 పరిధిలో రైతాంగానికి అవసరమైన నీటిని సరఫరా చేయకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ ఇటీవల రైతులను ఆరుతడి పంటలు వేసుకోవాలని నీటి సరఫరా వారాబందీ విధానంలో పంపిణీ చేస్తామని చెప్పడాన్ని ఆయన ఖండించారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న ఏ పంటకు సమృద్ధిగా నీరు అందక వర్షాలు పడక పంటలు ఎండిపోతున్నాయని, తాగు నీటితోపాటు సాగునీరు కూడా కాలువ చివరి భూముల వరకు సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు సెప్టెంబర్ ఒకటో తేదీ లోపు సాగర్ నీరు సరఫరా చేయకుంటే రెండో తేదీ మార్టూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు రైతులు వందలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాలెపు సాంబయ్య, బత్తుల హనుమంతరావు, వీరవల్లి కృష్ణమూర్తి, మోహన్రావు, సూరిబాబు, నాగేశ్వరరావు, వైరాంబాబు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హక్కులు, బాధ్యతలపై అవగాహన తప్పనిసరి

అద్దంకి రూరల్: రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని న్యాయవాది షేక్ మహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం ఉచిత న్యాయహాయం, విద్యార్థులకు ఉచిత ప్రాథమిక విద్య, పోక్సో యాక్ట్ వంటి చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీమతి పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది మహమ్మద్ రఫీ

గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు శాఖ గ్రంథాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా 2023-24 సంవత్సర రికార్డులను పరిశీలించారు. ఒంగోలుకు చెందిన రిటైర్డు డిప్యూటి కలెక్టర్ పీ. పేరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 10 మందికి గ్రంథాలయ సభ్యత్వాన్ని కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి. కోటేశ్వరరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుబ్బారావు, లైబ్రేరియన్ బాదం విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



పేరాలలో ప్రత్యేక అలంకరణలో మదన గోపాలుడికి ఉత్సవం చేస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజల్లో భాగంగా భజనలు చేస్తున్న భక్తులు

చీరాల: కృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం పట్టణం, రూరల్ గ్రామాల్లోని దేవాలయాలన్నీ శ్రీకృష్ణుని పూజలు, అలంకరణలతో కిటకిటలాడాయి. కృష్ణాష్టమి సందర్భంగా రాధాకృష్ణ మందిరాలు, వేణుగోపాలస్వామి, మదనగోపాల స్వామి, వీరరాఘవ స్వామి, పాండురంగ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపిల్లలకు కృష్ణుని అలంకరణ వేషాలతో పాటు ఉట్టికొట్టే వేడుకలు చేపట్టారు. దేవాలయాల అర్చకులు కృష్ణుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కృష్ణుడుని దర్శించుకున్నారు. అలానే గోశాలలో శ్రీకృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం సాయంత్రం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఆ బాలగోపాలం పాల్గొన్నారు. అనంతరం బాలబాలికలు పాటలు పోటీలు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వైష్ణవ సంప్రదాయ ప్రకారం స్వామివారిని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. రిటైర్డ్ తెలుగు పండితుడు జీ పిచ్చయ్య నిర్వహణలో ఆలయ అర్చకులు అలహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో భావన్నారాయణ స్వామివారు

పడకేసిన ప్రభుత్వ వైద్యశాల



పర్చూరు వైద్యశాలలో రోగులతో కిక్కిరిసిన రోగులు



తాళం వేసి ఉన్న వైద్యశాల సూపరింటెండెంట్ గది

- జ్వరపీడితులతో నిండిపోతున్న వైనం
- వైద్యుల కొరతతో ఇబ్బందులు పడుతున్న రోగులు
- చుట్టపు చూపుగా వచ్చిపోతున్న సూపరింటెండెంట్

పర్చూరు (చినగంజాం): ప్రభుత్వ వైద్యశాలలు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లకు సైతం రోగులు క్యూ కడుతున్నారు. ప్రస్తుత సీజన్ వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, డెంగీ జ్వరాలతో ప్రతి రోజు ఆసుపత్రికి రోగులు వస్తూనే ఉన్నారు. జ్వర పీడితులతో పాటు సాధారణ వ్యాధుల రోగులు కూడా ఆసుపత్రిలో చేరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన సుమారు 40 మంది రోగులు జ్వర పీడితులు ఆసుపత్రిలో చేరినట్లు సిబ్బంది తెలిపారు. పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రి కాగా వాటిలో 24 పడకలు జ్వర పీడితులతో నిండిపోయినట్లు వారు తెలిపారు. ఇటీవల ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందడంతో స్థానికంగా ప్రభుత్వ వైద్యులు అప్రమత్తం అయ్యారు. పర్చూరు, ఇంకొల్లు మండలాల్లో వైద్యులు హుటాహుటిన ఆసుపత్రి పరసరాలను, గ్రామాలలో ఇంటింటికి పర్యటించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నివారణ చర్యలు చేపడుతున్నారు.

పర్చూరు వైద్యశాలలో రోగుల అవస్థలు..

పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు కొరత రోగులను ఇబ్బందులకు గురి చేస్తుంది. వైద్యశాలలోని డెంటల్, గైనకాలజీ, అనస్తీషియా వైద్యులు వారానికి మూడు రోజులు మాత్రమే హాజరవుతుండటంతో రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారితో పాటు వైద్యశాలలో నర్సుల కొరత కూడా అల్లాడిస్తోంది. సకాలంలో వైద్యులు లేకపోవడం, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత సీజన్‌లో రోగుల ఇబ్బందులు చెప్పనలవి కావడం లేదు. ఆసుపత్రికి వచ్చామా లేక ఏదైనా శిక్ష అనుభవించేందుకు వచ్చామా అంటు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉండని ఆసుపత్రి సూపరింటెండెంట్..

ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో వసతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్న సూపరింటెండెంట్ చర్యలపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులోనైనా సూపరింటెండెంట్ అందుబాటులో ఉండి రోగుల స్థితిగతులను పట్టించుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యురాలు జే సౌమ్య మాట్లాడుతూ దోమలు చేరకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే విషజ్వరాలు రావని ఆమె తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా సమీప వైద్యశాలను సంప్రదించి చికిత్స సకాలంలో చేయించుకోవాలని తెలిపారు.

కర్రలతో దాడి చేసినందుకు కేసు

అద్దంకి రూరల్: ఓవ్యక్తిపై ఇద్దరు కలిసి కర్రలతో దాడిచేశారు. ఈఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నాగేశ్వరరావు పేర్కొన్నారు. పోలీసుల వివరాల మేరకు.. అద్దంకిలోని గుంజివారిపాలేనికి చెందిన మక్కల రమేష్‌ను మణికంఠ, గోపి సోమవారం కర్రలతో దాడి చేయగా అడ్డువచ్చిన రమేష్ తల్లికి గాయాలయ్యాయి. ఇరువురు అద్దంకి వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శ్రావణ మాసం, మృగశిర నక్షత్రం, దశమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని అన్నారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 39 గేదెలకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 19 గొర్రెలు, 18 దూడలకు, 25 పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యురాలు పావని మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని, పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు, పాల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన దాణాలను, అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

అద్దంకి రూరల్: అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమంగా రాత్రి సమయంలో గ్రామం నుంచి ఇసుక తరలిస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకున్న ఘటన సోమవారం రాత్రి మండలంలోని మణికేశ్వరం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని మణికేశ్వరం గ్రామంలోని గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలోని ఇసుకను సోమవారం రాత్రి అధికార పార్టీకి నాయకులు ట్రక్కులతో తరలిస్తుండగా వేరే ఊరు నుంచి వచ్చి ఇక్కడి ఇసుకను తీసుకెళ్లటానికి వీలులేదని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదనలు చేసుకుని మంగళవారం ఇరువురు పోలీస్ స్టేషన్ ఆశ్రయించినట్లు సమాచారం.

అండర్ టన్నెల్ నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన

పర్చూరు (చినగంజాం): వరద వచ్చినప్పుడు నీళ్లు గ్రామంలోనికి రాకుండా సులభంగా వెళ్లిపోయేలా నేల చప్టా వద్ద అండర్ టన్నెల్ నిర్మించాలని తిమ్మరాజుపాలెం గ్రామస్తులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నేల చప్టా వద్ద నీరు ప్రవహించేందుకు అధికారులు తూములను ఏర్పాటు చేశారు. వరద వచ్చి ఎక్కువ నీటి ప్రవాహం వచ్చినప్పుడు తూముల గుండా నీరు ప్రవహించవని గ్రామస్థులు వివరించారు. వరద దాటికి నీరు గ్రామంలోకి వచ్చి గ్రామం మునిగిపోయే ప్రమాదం ఉందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన తూములను వెంటనే తొలగించి వాటి స్థానంలో అండర్ టన్నెల్ ఏర్పాటు చేయాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న స్థానిక తహసీల్దార్ బ్రహ్మయ్య గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య